క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘించొద్దు



బిజినేపల్లి: నిబంధనల మేరకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఏఓ కమల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. డీలర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దుకాణాల ఎదుట ధరల పట్టిక ప్రదర్శించాలని, ట్రేడ్ లైసెన్సులు తప్పకుండా ఉండాలన్నారు. నిబంధనలకు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు లైసెన్సు ఉన్న దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు. సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి



అమ్రాబాద్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ అన్నారు. కోనేరు సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సుసంపన్నం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ అంశాలపై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కోనేరు సంస్థ కోఆర్డినేటర్లు తిరుపతయ్య, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని చేగుంటలో గడ్డం దేవదాసు మంగళవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన మారేపల్లి సురేందర్‌రెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. వారి ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో అంత్యక్రియల నిమిత్తం బాధిత కుటుంబసభ్యులకు రూ.10000 ఆర్థిక సాయం అందజేశారు.

కాంగ్రెస్ నాయకుడికి..




మన్ననూర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ ఇస్మాయిల్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొన్ని నెలల కిందట అతని కూతురు మృతిచెందింది. ప్రస్తుతం ఎండీ ఇస్మాయిల్ గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతూ చికిత్స చేసుకునేందుకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. దీంతో ఆ పార్టీ నాయకులు స్పందించి అమ్రాబాద్ మండల కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రహీం సమక్షంలో నాయకులు వెంకటరమణ, హన్మంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శివాజీ, లాల్‌సింగ్, రాజారామ్‌లు బాధితుడికి పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణతో మాట్లాడి చికిత్స అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

పెంట్లవెల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామన్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు దగ్గర ఉంచుకోవాలని కోరారు. హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో జరిమానా విధించి కేసు నమోదు చేస్తామని వాహనదారులకు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



పెంట్లవెల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ సమస్యలను మంత్రి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. గ్యారంటీ పథకాలు పేదలందరికీ అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుమార్, శేఖర్, వినోద్‌లు పాల్గొన్నారు.

తాగునీటికి కటకట

● అడుగంటిన భూగర్భ జలాలు



ఎర్రపెంటలో ట్యాంకర్ వద్ద ..



ట్యాంక్ వద్ద ధారగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

లింగాల: వేసవి కాలం ప్రారంభంలోనే మండలంలోని పలు గ్రామాలలో నీటి ఎద్దడి సమస్య మొదలైంది. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వేసవి తీవ్రత పెరగముందే నీటి సమస్య తలెత్తడంతో స్థానికులు ఆందోళన పడుతున్నారు. ముస్ముందు ఎలా ఉంటుందో ఊహించేందుకు భయంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. మండలంలోని శ్రీరంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రపెంటలో జనాభాకు సరిపోను తాగునీరు అందకపోవడంతో చెంచులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెంటలో 350 వరకు జనాభా ఉండగా జనాభాకు అనుగుణంగా నీటి అవసరాలు లేకపోవడంతో సమస్యగా మారింది. గ్రామంలో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు, ఒక మినీ వాటర్ ట్యాంక్ ఉంది. రెండు ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు సంబంధించిన బోర్ల మోటార్లు చెడిపోయాయి. వాటిని మరమ్మత్తులు చేయించడానికి ఇచ్చినప్పటికి గ్రామ పంచాయతీలో నిధుల కొరత కారణంగా బిగించలేదు. దీంతో తాగునీటికి కోసం గ్రామస్తులు అల్లాడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ట్యాంక్‌లు నిండే పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే నీరు సగం ట్యాంక్ వరకే రావడం వలన ప్రజలకు ఏ మాత్రం సరిపోక పోవడం, రెండో ట్యాంక్‌కు మిషన్ భగీరథ పైపు కనెక్షన్ ఇవ్వక పోవడంతో పెంటలో కొన్ని ఇళ్లవారికి మాత్రమే నీరందుతోంది. ఇక పెంటలో చేతి పంపుల జాడే లేదు.

మోటార్లు బాగు చేయిస్తాం

తాగునీటిని సమస్యను అధిగమించుటకు చర్యలు తీసుకుంటున్నాం. అత్యవసర సమయంలో శ్రీరంగాపూర్ నుంచి గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా పెంటకు నీటి సరఫరాను చేస్తున్నాం. చెడిపోయిన మోటార్లను బాగు చేయించి ట్యాంక్‌లకు నీటిని అందిస్తాం.

– శకుంతలాదేవి, పంచాయతీ కార్యదర్శి, శ్రీరంగాపూర్

బోర్లకు ఫ్రెషింగ్ చేస్తాం

మండలంలో భూగర్భ జలాలు అడుగంటి పోతుండడంతో సమస్య నెలకొంటుంది. ప్రస్తుతం నీటి సమస్య ఉంది. మునుముందు సమస్య తీవ్ర రూపం దాల్చక ముందే బోర్లను ఫ్రెషింగ్ చేయిస్తాం. ఎర్రపెంటలో నీటి సమస్య రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం.

– బాల్‌రాంనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, లింగాల

ఖాతాదారులకు తప్పని తిప్పలు

లింగాల: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ప్రధాన మార్గంలో ఉంది. కొన్నేళ్ల నుంచి కొల్లాపూర్ వెళ్లే రోడ్డు మార్గంలో బ్యాంక్ కొనసాగుతుండడంతో అనునిత్యం రద్దీగా ఉండడంతో ఖాతాదారులకు తిప్పలు తప్పడం లేదు. ఈ మార్గంలో వివిధ గ్రామాలకు వెళ్లే వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రజలు, బ్యాంక్ ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంక్‌కు వచ్చే వారి వాహనాలకు ఎలాంటి పార్కింగ్ లేక పోవడం, రోడ్డు పైనే వాహనాలను ఇష్టానుసారం నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. బ్యాంక్‌ను ఇతర ప్రాంతానికి మార్చుటకు బ్యాంక్ ఉన్నతాధికారులు గతంలో నిర్ణయించారు. కాని ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. పాత భవనంలోనే బ్యాంక్ లావాదేవిలో కొనసాగిస్తున్నారు. సంబంధిత బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో మరో అనువైన ప్రదేశానికి బ్యాంక్‌ను తరలించి ఇబ్బందులు తొలగించాలని, ప్రజలు, ఖాతాదారులు కోరుతున్నారు.



లింగాలలోని ఎస్‌బీఐ ఎదుట రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మగ్దూంపూర్‌లో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తాడూరు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ జ్యోతిపరోసియా, ఏపీఓ చంద్రసిద్దార్థలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు పాలుమూరు, గుట్టలపల్లి గ్రామాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు వన నర్సరీల నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలకు గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వార ప్రతి రోజు నీటిని మొక్కలకు అందించాలని కార్యదర్శులకు సూచించారు. ఎండలు తీవ్రమవుతున్న సందర్భంగా నీటిని తప్పనిసరి మొక్కలకు సరఫరా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు.

'ఉపాధి' కల్పిస్తాం

లింగాల: జాబ్ కార్డు ఉన్నవారందరికీ ఎండాకాలంలో ఉపాధి కల్పిస్తామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. మండలంలోని మగ్దూంపూర్ శివారులో ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. సౌకర్యాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పనులు చేయాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మస్టర్లలో బినామీ పేర్లు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ కర్ణనాయక్, ఏపీఓ ఇమాంఅలీ పాల్గొన్నారు.



గుట్టపల్లిలో మొక్కకు నీటిని పడుతున్న ఎంపీడీఓ

ప్రతిఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలి



కల్వకుర్తిరూరల్: ప్రతిఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివ అన్నారు. మంగళవారం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శర్వాణీ తన పిల్లల పాత దుస్తులను సేవా బృందం సభ్యులకు అందజేశారు. ఈ మేరకు వారు పేద చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ పాతదుస్తులను బయట పడేయకుండా పేదలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చింటు, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ దేవతల ఉత్సవాలు



తాడూరు: మండల కేంద్రంలో వారం రోజుల నుంచి కొనసాగుతున్న కురుమయాదవులు, ముదిరాజుల గ్రామదేవతలైన వీరనాగమ్మ, బీరప్ప ఉత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా దేవతల పటాలతో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పూనకాలు ఊగారు. నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి డాక్టరేట్



పెద్దకొత్తపల్లి: పెద్దకార్వాముల గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మునిపాల రమేష్ ఎన్‌ఐటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) గోవా నుంచి డాక్టరేట్ అవార్డు పొందాడు. ఈసీజీ సిగ్నల్ అనాలసిస్ ఫర్ లైట్ డిటెక్షన్ న్యూసింగ్ ఏపీసెంట్ కన్సల్టేషన్ ఇంటలిజెన్స్‌పై రిసెర్చ్ చేయడంతో అవార్డు దక్కింది. డాక్టరేట్ పొందిన రమేష్‌కు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, శివుడు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అమ్రాబాద్: షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన సంఘటన మంగళవారం అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్(బీకే) తండాలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొర్ర శ్రీను కుటుంబ సభ్యులతో ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం తన గుడిసె నుంచి మంటలు రావడంతో స్థానికులు చల్లార్చేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక వాహనం వచ్చి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోవడంతో పాటు పక్కనే ఉన్న జైపాల్ ఇంటి ముందు ఉన్న సపారం కాలిపోయింది. సమాచారం తెలుసుకున్న శ్రీను గుడిసె వద్దకు చేరుకున్నాడు. అవసరాల నిమిత్తం అప్పు తీసుకొచ్చి ఇంట్లో పెట్టిన రూ.2.5 లక్షలు, నగలు, మొత్తం రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు విలపించాడు.

కొండారెడ్డిపల్లి అభివృద్ధికి కృషి

వంగూరు: సీఎం రేవంత్‌రెడ్డి స్వంత గ్రామమైన కొండారెడ్డిపల్లి అభివృద్ధికి కృషి చేస్తామని ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా కొనుగోలు చేసిన కార్లకు పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు అల్వాల్‌రెడ్డి, వేమారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు మంగళవారం సీఎం సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డిని సన్మానించారు. హైదరాబాదు నుంచి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లికి వెళ్తున్న తిరుపతిరెడ్డి మార్గమధ్యలో మండల కేంద్రంలోని పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సంజీవ్‌కుమార్‌యాదవ్, నాయకులు రామస్వామి, అలీ, కాదురామ్‌నాయక్, బాబా తదితరులు ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న తిరుపతిరెడ్డి దంపతులు

పక్కా భవనాలు నిర్మించాలి




కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలోని బీసీ గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరుతూ మంగళవారం బీసీ గురుకులాల కార్యదర్శి సైదులుకు మంగళవారం బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేందర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని కార్యదర్శి కార్యాలయంలో కార్యదర్శిని ఆయన కలిశారు. ఈసందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కల్వకుర్తి బీసీ జూనియర్ కళాశాల, బాలుర గురుకుల పాఠశాల, తలకొండపల్లి ఆమన్‌గల్ గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. కల్వకుర్తిలో బీసీ గురుకుల సొసైటీ నుంచి నర్సింగ్ కాలేజీని ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నాగుల వెంకటేశ్వర్లు, నర్సింహ, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ఐదో రోజు మంగళవారం భౌతిక శాస్త్రం సబ్జెక్టు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు అజీమ్‌పాష, సురేష్, డిపార్టుమెంటల్ అధికారులు రాజవర్ధన్‌రెడ్డి, మంజుల తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో 220 మంది, బాలికల ఉన్నత పాఠశాలల్లో 143 మంది కలిపి మొత్తం 363 మంది విద్యార్థులకు వంద శాతం విద్యార్థులు హాజరైనట్లు వారు పేర్కొన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు



ఇటుక బట్టీల యాజమానులతో మాట్లాడుతున్న ఆర్‌ఐ సురేందర్

సాక్షి ఎఫెక్ట్..

కోడేరు: బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. 'ఇటుక బట్టీలో బాలకార్మికులు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో మంగళవారం వార్త ప్రచురితం అయ్యింది. ఈ మేరకు తహసీల్దార్ స్పందించి ఆర్‌ఐ సురేందర్‌తో పాటు సిబ్బందిని ఇటుక బట్టీల దగ్గరకు పంపించారు. ఆర్‌ఐ ఇటుక బట్టీలను వారు సందర్శించి యజమానులతో మాట్లాడారు. బాలలతో పని చేయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఆంజనేయులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్యాడీ క్లీనర్లు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో ప్యాడీ క్లీనర్లు వృథాగా పడి ఉన్నాయి. దాదాపు 30కి పైగా ప్యాడీ క్లీనర్ యంత్రాలను రూ.30 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. అధికారుల నిర్లక్ష్యంగా ఆరుబయటనే ఉంచారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యంలో తాలు లేకుండా ఈ క్లీనర్లను వినియోగించారు. తూకం వేసి ధాన్యం కొనుగోలు చేసేవారు. గతంలో గోదాంలలో ఉన్న ప్యాడీ క్లీనర్లు 5 నెలల కిందట మార్కెట్ ఆవరణలో రక్షణ చర్యలు చేపట్టకుండా పెట్టడంతో అవి తుప్పు పట్టిపోయే అవకాశం ఉంది. ఈ విషయమై మార్కెట్ సెక్రెటరీ భగవంత్‌ను వివరణ కోరగా రెండుమూడు రోజుల్లో వీటిని గోదాంకు తరలిస్తామని లేకుంటే కవర్ కప్పి పాడవకుండ చర్యలు తీసుకుంటామని తెలిపారు.



టెట్ ఫీజు తగ్గించాలి



కొల్లాపూర్: టెట్ ఫీజును తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు డి.శేఖర్, పీయూ విద్యార్థి సంఘం నాయకులు బి.దాసు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టెట్ పరీక్ష ఫీజు రూ.200 మాత్రమే ఉండేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టెట్ పరీక్ష ఫీజును రూ.1000 నిర్ణయించడం సరికాదన్నారు. పేద విద్యార్థులపై ఆర్థిక భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ

కోడేరు: మండంలోని పస్పుల, ఎత్తం గ్రామ శివారులోని రెండు గ్రామాల్లోని 21 విద్యుత్ మోటర్ల రాగి వైర్లు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం పస్పుల గ్రామ శివారులో పెద్దకొత్తపల్లి మండలం దేవుని తిర్మలాపూర్ చెందిన 7 మంది రైతులు కేఎల్‌ఐ కాల్వలో సాగు నీటికోసం విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు మోటార్లలో ఉన్న రాగి వైర్లను చోరీ చేశారు. అదేవిధంగా ఎత్తం శివారులో బీమా కాల్వలో 14 మంది రైతుల విద్యుత్ మోటార్ల వైర్లను ఎత్తుకెళ్లారు. ఆయా గ్రామాల రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఊర్కొండ: మండలం కేంద్రంలోని పీర్ల గుండు వద్ద ఆమన్‌గల్ కు చెందిన దుర్గేష్ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వీరబాబు వివరాల ప్రకారం దుర్గేష్ ఫోటో ఫ్రేమ్ దుకాణం నడిపిస్తూ జీవిస్తున్నాడు. అద్దాలను కోసేందుకు ఉపయోగించే కట్టర్ తో కాళ్లు, చేతులు కోసుకున్నాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం 108లో కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేశాడని పేర్కొన్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

బీరు బాటిళ్లు స్వాధీనం

ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లిలో మట్ట సత్యనారాయణగౌడ్ కిరాణదుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. మంగళవారం తనిఖీలు నిర్వహించగా బీరు బాటిళ్లు నిల్వ చేసినట్లు గుర్తించామని పేర్కొన్నారు. అతని వద్ద నుంచి 13 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

వీపనగండ్ల: అర్ధాంతరంగా విద్యను మానేసి నిరుద్యోగులుగా ఉన్నా యువత వ్యవసాయ రంగంపై ఆసక్తి ఉన్నవారికి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నర్సరీల ఏర్పాటు, మొక్కల పెంపకం, నారుమడుల తయారీ తదితర వ్యవసాయ అంశాలపై ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు మండల ఉద్యానవన శాఖాధికారి కృష్ణ అన్నారు. శిక్షణ కార్యక్రమంలో నర్సరీల్లో షెడ్‌ల ఏర్పాటు, పాలీహౌస్‌ల నిర్మాణం, మొక్కలు అంటుకట్టడం, బండింగ్, గ్రాఫ్టింగ్, లేయరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు

అమ్రాబాద్: రక్షణ గోడలు లేని కల్వర్టులతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రాణాలు అరచేతిలో ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. అమ్రాబాద్ మండలంలోని పలు చోట్ల కల్వర్టులపై రక్షణ గోడలు నిర్మించలేదు. కుమ్మరోనిపల్లి సమీపంలోని మందవాగుపై, ఈదులబావి, తుర్కపల్లి, అమ్రాబాద్ సమీపంలో చింతలోనిపల్లి రోడ్డు, ఎల్మపల్లి, తిర్మలాపూర్(బీకే) రోడ్లపై రక్షణ గోడలు లేని కల్వర్టులు ఉన్నాయి. కల్వర్టులు నాణ్యత లేకుండా నిర్మించడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. కల్వర్టుల వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించ బోయి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు కింద పడి ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కల్వర్టులపై రక్షణ గోడలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మందవాగుపై రక్షణ గోడలు లేని కల్వర్టు